క్లుప్తంగా

ఓటుహక్కుపై అవగాహన



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ కూలీలకు ఓటు హక్కుపై ఏపీఓ చంద్రసిద్ధార్థ అవగాహన కల్పించారు. మండలంలోని ఆకునెల్లి కుదురు, మేడిపూర్, ఎంగంపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశాల వద్దకు వెళ్లి ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



కల్వకుర్తి రూరల్: అకాల వర్షాలకు, వడగండ్ల వానకు వరిపంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ రామకృష్ణ మంగళవారం కోరారు. సోమవారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు మండలంలోని ఎల్లికల్, జంగారెడ్డిపల్లి, తిమ్మరాశిపల్లి ప్రాంతాలలో వరి చేలు దెబ్బతినగా, మామిడితోటలకు నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక జెడ్పీ గ్రౌండ్‌లో క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్‌ఠాగూర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వాస రాఘవేందర్ మాట్లాడుతూ బాల్యదశ నుంచే మహాత్ముల జీవిత చరిత్రలను తెలుసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులందరికి మహాత్ముల జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. పోల శ్రీనివాసులు, కూన కిరణ్, సురేందర్, మల్లేష్, శ్యాంసుందర్, వేణు, వీరేష్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే



నాగర్‌కర్నూల్‌రూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని ఆ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ఓటర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓటించాలని కోరారు. ప్రధాని మోసపూరిత హామీలు నమ్మొద్దన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, కందికొండగీత, మండల నాయకులు అశోక్, కాశన్న, రామయ్య, శాఖ కార్యదర్శులు సుభాష్, బాలరాజు, సత్యం, నాగరాజుగౌడ్, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ విఫలం



నాగర్‌కర్నూల్‌రూరల్: హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ విఫలం అయ్యిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక రైతుసంఘం జిల్లా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకంగా ఉద్యమించినప్పుడు ఆ సందర్భంగా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటికి అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేష్, బాలరాజు, శ్రీను, కాశన్న, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం నాగర్‌కర్నూల్‌కు వస్తున్న కారు మండలంలోని దాసుపల్లి గేటు సమీపంలో ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొన్నది. బైక్‌పై ఉన్న పవన్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రిఫర్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూగజీవాలకు నీళ్లు కరువు

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాలలో కుంటలు, చెరువులు, బావుల సైతం పూర్తిగా ఎండిపోయాయి. దీంతో పలు గ్రామాలలో ఉన్న పశువులు, గొర్రెలు తాగడానికి నీరు లేక ఎన్నో అవస్థలు పడుతున్నాయి. దీంతో రైతులు నీరు ఎక్కడిక్కడి నుంచో తీసుకొచ్చి పశువులకు నీరు తాపే దుస్థితి నెలకొంది. మండల కేంద్రంలో కూడ చౌట చెరువు, మల్లేశ్వరంలో తేటకుంట, మంచాలకట్టలోని బోయవాని కుంట ప్రతి ఎండాకాలం వర్షాలు కురువకపోయినా నీరు లభించేది. పలు గ్రామాల్లో పశువులకు నీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఎండల తీవ్రతకు కుంటలు, చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. ఎక్కడ కూడా పశువులకు నీరు అందుబాటులో ఉండే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో గొర్రెల కాపరులు, పశువుల కాపరులు ఏం చేయాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపెద్ద చెరువులలో ఎప్పుడు లేని విధంగా నీరు ఎండిపోయింది. రైతులు అటు వర్షాలు లేక, చెరువులలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు..

పశువులకు, మూగజీవాలకు దాహం తీర్చేందుకు ప్రభుత్వం నీటితొట్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లి గ్రామాల్లో నీటితొట్లను ఏర్పాటు చేసింది. గతంలో పల్లె గ్రామాల్లో పశువులకు ఇబ్బందిగా ఉంటుందని



మల్లేశ్వరంలో ఎండిపోయిన చెరువు



నిరుపయోగంగా జటప్రోల్‌లో నీటి తొట్టి

గ్రామాల్లో అక్కడక్కడ 10 మీటర్ల పొడువున పశువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసి వాటికి నల్లా కనెక్షన్ ద్వార ఎప్పుడు నీరు ఉండేలా పశువులకు అందేలా చూసేవారు. పెంట్లవెల్లి మండలంలోని నీటి తొట్లు కొండూరు 3, గోవులాపూర్ 1, జటప్రోల్ 2, సింగవరం ఒకటి ఏర్పాటు చేశారు. వీటిలో రెండు నీటి తొట్లు మాత్రమే వినియోగంలో ఉండగా మిగతావి నిరుపయోగకరంగా మారాయి.

పశువుల వివరాలు..

పశువులు, గొర్రెల సంఖ్యకు అనుగుణంగా రెండు నీటి తొట్లు అవసరమని పలు గ్రామాల పశువుల కాపరులు పేర్కొంటున్నారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో మరింత క్లిష్టమైన పరిస్థితులు దాపురిస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఆవులు,ఎద్దులు 20613, గేదెలు 2417, గొర్రెలు 43441, మేకలు 2310, పందులు 505 ఉన్నాయి.

మూగజీవాలకు నీరు దొరకడం లేదు..



పదేళ్లుగా మూగజీవాలను మేపుతున్నాం. ఎప్పుడు కూడా పూర్తి స్థాయిలో చెరువులు, కుంటలు ఎండలేదు. ప్రస్తుతం నీరు లేక పోవడంతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. నీటి కోసం ఇంత అవస్థ ఎప్పుడు పడలేదు. మూగజీవాలను అమ్ముకునే పరిస్థితి ఉంది.

– అంజనేయులు, గొర్రెల కాపరి, మంచాలకట్ట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



మండల వ్యాప్తంగా గతంలో నిర్మించిన నీటి తొట్లను పరిశీలిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పూర్తి వివరాలు సేకరించి నివేదిక తయారుచేస్తాం. నీటితొట్ల మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– యాదగిరి, పశువైద్యాధికారి, పెంట్లవెల్లి

మోదీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు

• ఎంపీ రాములు

అచ్చంపేట రూరల్: దేశంలో మోదీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడో సారి ప్రధానిగా మోదీ పగ్గాలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ గెలుపు కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజరంజక పాలనతో పాటు, ప్రపంచ దేశాల అధినేతల మన్ననలు పొందిన మోదీ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా దేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన ఘటన బీజేపీకే దక్కుతుందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ నెల 11న వనపర్తి జిల్లాలో నిర్వహించే రోడ్‌షోకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంగ్యానాయక్, రేణయ్య, నజీర్, ఖలీల్ పాల్గొన్నారు.



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

ఉప్పునుంతల: భారత దేశ భవిషత్తును దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటువేసి ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలపర్చాలని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. మంగళవారం మండలంలోని జప్తీ సదగోడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులను కలిసి బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత రేషన్ బియ్యం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళలకు సమన్యాయం



ఉప్పునుంతలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ




మన్ననూర్‌లో ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

ఉప్పునుంతల: కాంగ్రెస్‌తోనే మహిళలకు సమన్యాయం దక్కుతుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా నిర్వహించిన మండల స్థాయి మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలోనే మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు, హక్కులు కల్పించారని గుర్తుచేశారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలను పెంచుతామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ తదితర పథకాలను అమలుచేశామన్నారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి మల్లురవి సతీమణి రాజ భాస్పీదేవి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మోపతయ్య, నిరంజన్‌రెడ్డి, అనంతరెడ్డి, సరిత, జగన్‌మోహన్‌రెడ్డి, రేణయ్య తదితరులు పాల్గొన్నారు.


వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల, మైసమ్మపల్లు తండా, మర్రిగుంతండా, కేస్లీతండా తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు పర్వత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, ఫుల్‌సింగ్, దేశ్యానాయక్, విమల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

మన్ననూర్: స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మల్లురవికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. వెంకటరమణ, సత్యనారాయణ, గోపాల్, కృష్ణయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలు నమ్మొద్దు



కొల్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



తెలకపల్లి మండలం గౌతంపల్లిలో

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/పెంట్లవెల్లి: కాంగ్రెస్ మోసపూరిత హామీలతో మరోసారి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఆంజనేయులుగౌడ్‌తో కలిసి ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్‌లో ఉపాధి కూలీలను కలిశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీరం హాజరై ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఆంజనేయులు గౌడ్, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, నరేందర్‌రెడ్డి, రాంచందర్‌యాదవ్, సాంబశివుడుయాదవ్, కాటం జంబులయ్య, కృష్ణమూర్తి, విక్రమ్‌పాష, కట్టా శ్రీనివాసులు, పసుపుల కృష్ణ, చాకలి నర్సింహ్మ, ఖాధర్‌పాష, హరికృష్ణ, నవీన్‌సింగ్, వెంకటేష్ తదితరులున్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్లలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రం, ఎంపీటీసీ కోంద్ర బిచ్చయ్య, భాస్కర్ రావు, బంగారయ్య, మొద్దు శ్రీనివాసులు, కృష్ణయ్య, రాముడు, నాయకులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌతంపల్లిలో కాంగ్రెస్ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆశీర్వదించాలని కోరారు. గౌతంపల్లిలో ఉపాధ/ హామీ కూలీలను కలిశారు. అర్దంరవి, లక్ష్మయ్య, మాధవ రెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంతో పాటు జూపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గజ్జె యాదయ్య గౌడ్, కలమండల జగపతి హాజరయ్యారు.

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి, చెర్కూర్, నారాయణపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ విజితారెడ్డి, మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, హైజాక్, నర్సింహ్మముదిరాజ్, నర్సింహ్మ, నాగులునాయక్, ఉన్నారు.

సారా స్వాధీనం: కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పునుంతల– అచ్చంపేట రహదారిలో గుట్టమీది తండా స్టేజీ వద్ద మంగళవారం తండాకు చెందిన మహిళ జర్పుల పిక్లీ అక్రమంగా సారాను తరలిస్తోంది. పోలీసుల తనిఖీలో మహిళ పట్టుబడింది. మహిళ నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారు జామున ఈదురుగాలతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో గంటపాటు వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల పిడుగుపాటులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండల కేంద్రంలో శివారులో రైతు బునాద్రి నిరంజన్‌కు సంబంధించిన వ్యవసాయ పొలం దగ్గర పిడుగు పడి ఎద్దు మృతి చెందింది. దీని విలువ రూ.70 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బీజేపీతో రైతులకు నష్టం




నాగర్‌కర్నూల్‌రూరల్: బీజేపీతో రైతులకు నష్టం కలుగుతుందని పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదని రాష్ట్ర రైతుసంఘం నాయకులు పాకాల శ్రీహరిరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. రైతులు అప్పులపాలై దుర్భర జీవితాలు గడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు హబీబ్, జెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన రాములు (48) చాలారోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని మృతిచెందాడు. గుర్తించిన పక్కంటివారు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పాఠశాల భవనం ప్రారంభమెప్పుడో?



తాడూరు: మండల కేంద్రంలో ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. రెండేళ్ల కిందట మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ఈ ఏడాది విద్యాసంవత్సరంలోనే పాఠశాల భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్ఐ

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లిలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నూతనంగా సహాయ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఎస్ఐ రవి పోలింగ్ బూత్ 152/ఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌కు ప్రహరీ లేదని అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన వెంట కార్యదర్శి ఫైయాజ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మండలం కంటోనిపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద ఎస్ఐ రవి

అద్దంకి దయాకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న బాలాజీ

అచ్చంపేట రూరల్: హిందూవుల ఆరాధ్య దైవం శ్రీరాముడి, సీతాదేవిపై అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ వెనక్కి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మండికారి బాలాజీ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే అద్దంకి దయాకర్ హిందూ ధర్మాన్ని, దేవతలను హేళనగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులకు ఫ్యాషన్‌గా మారిందని ఆరోపించారు. దేశం కోసం, ధర్మంకోసం అహర్నిషలు పనిచేస్తున్న నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రేణయ్య, రాజు, వీరయ్య, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి

నాగర్ కర్నూల్: ప్రాంతీయ పార్టీలతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీఎల్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎం గౌడ్ అన్నాడు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో మీటింగ్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గురుకులాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దడంతో పాటు పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను విద్యలో ఉన్నత స్థానాలకు తీసుకెళ్లడంతో ఆర్‌ఎస్పీ ఎంతో కృషి చేశారని కొనియాడారు. విద్యావేత్తకు అందరు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య నాయకులు, నాగయ్య, వెంకటయ్య, తిరుపతయ్య, భాస్కర్ నాగరాజు, ఆంజనేయులు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎల్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎం గౌడ్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

బిజినేపల్లి: రైతు భరోసా పథకం కింద ఐదు ఎకరాలకు పైన ఉన్న రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మిద్దె రాములు, కత్తె ఈశ్వర్, చంద్రగౌడ్ బంగారయ్య, గోవింద్‌నాయక్, ఎర్ర రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఎస్సీలకు న్యాయం

నాగర్‌కర్నూల్: కాంగ్రెస్‌తోనే ఎస్సీలకు న్యాయం చేకూరుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి ఈ రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో కుల మతాలకు అతీతంగా మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి అన్ని వర్గాలకు చెందిన వారిగా, అందరివాడిగా పేరుందని కొనియాడారు. మాల, మాదిగ సామాజిక వర్గాలను విచ్ఛిన్నం చేసేందుకు కొందరు నాయకులు ప్రలోభాలకు తెరలేపారని వారి కుట్రలకు బలికావొద్దని కోరారు. మల్లు రవి గతంలో ఎంపీగా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎస్సీల కోసం నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు. మాల, మాదిగలు మల్లురవికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రిటైర్డ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండన్న, జంగయ్య, కావలి శ్రీనివాసులు, ఆదిగోపాలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈ రాములు

బీజేపీతోనే పేదల సంక్షేమం



మాచుపల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు



ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న రాంభూపాల్ రెడ్డి

కోడేరు: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తిరెడ్డిపల్లి, మాచుపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. పేదలకు బీజేపీ ప్రభుత్వం ఉచితంగా రేషన్‌బియ్యం అందజేస్తుందని వివరించారు. బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఇందిరానగర్‌లో బీజేపీ నాయకుడు రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబీదేవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: ప్రధాని మోడీ ఉన్నంత కాలం బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కొనసాగుతాయని బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరు జానకి అన్నారు. మండలంలోని రంగాపూర్, బొల్గట్‌పల్లి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల, అంకిరావు పల్లి, జవాయిపల్లి, తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాయి కృష్ణగౌడ్, రాజశేఖర్, కృష్ణయ్య, నరేందర్, చరణ్, శివ, రమేష్ పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని రాచూర్, కొట్ర గ్రామాల్లో కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి ఇంటింటి ప్రచారంలో భాగంగా భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. బాలస్వామి, సురేష్‌రెడ్డి, మోహన్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌చారి ఉన్నారు.



3 ఇసుక టాక్టర్ల పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట గ్రామానికి చెందిన ముగ్గురు ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా తూంకుంట ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకొని పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ నందీకర్ తెలిపారు. అక్రమ ఇసుక తరలింపునకు పాల్పడ్డ వీరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్టు రాముకు నివాళి

నాగర్‌కర్నూల్: అనారోగ్యంతో మృతి చెందిన నాగర్‌కర్నూల్ జర్నలిస్టు రాసాల రాము అకాల మృతి పట్ల నాగర్ కర్నూల్ జర్నలిస్టులు సంతాపం తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో జర్నలిస్టు రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాము అకాల మరణం తీరని లోటని జర్నలిస్టులు వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సీనియర్ జర్నలిస్టులు కందికొండ మోహన్, కేఎస్ సురేష్, రామ్ లక్ష్మణ్, ఎండీ దర్వేష్, కొండ కింది మాధవరెడ్డి, ఖానాపురం ప్రదీప్, బాలస్వామి, వివిధ మాధ్యమాల జర్నలిస్టులు సహదేవుడు, సైదులు, వసీం, రియాజ్, రామకృష్ణ, వెంకట్, సుధాకర్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంతాపం తెలుపుతున్న జర్నలిస్టులు